క్లుప్తంగా

ఆ ఉపాధ్యాయులను తొలగించాలి



ఏటూరునాగారం: విద్యార్థులకు, విద్యాబుద్ధులు నైతిక విలువలు చెప్పాల్సిందిపోయి.. వృత్తికే కలంకం కలిగేలా ప్రవర్తించిన మంగపేట ఉపాధ్యాయులను డిస్మిస్ చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓ, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ఇరువురిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కన్నాయిగూడెం: ప్రేమాయనం సాగించిన ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి విభాగం ప్రచార కార్యదర్శి నాగబాబు కోరారు. విద్యార్థులపై ప్రభావం చూపే ఇలాంటి చర్యలకు పాల్పడే వారికి భయం కలిగేలా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



వెంకటాపురం(కె) : తమ కంపెనీలో పనిచేస్తూ.. అనారోగ్యంతో మృతి చెందిన బెస్తగూడెం గ్రామవాసి బట్ట అశోక్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. గురువారం కావేరి సీడ్స్ కంపెనీ ఉద్యోగులు, ఆర్గనైజర్లు కలిసి రూ.లక్ష పన్నెండు వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ రావు, జీఎం విజయభాస్కర్, వాడగూడెం సర్పంచ్ లాలీబాబు, సుమన్ రావు, శ్రీనివాసరావు, సంపత్, అర్గనైజర్లు ధనపనేని నాగరాజు, చిడెం శివ తదితరులు ఉన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



మహదేవపూర్: మండలంలోని బెగుళూర్, రాపెల్లికోట గ్రామాల్లో పశువులకు నట్టల నివారణ మందు పంపిణీ చేసినట్లు మండల పశువైద్యాధికారి మల్లేష్ అన్నారు. మండలంలోని రైతులు, పశువుల యాజమానులు తప్పకుండా నట్టలనివారణమందు వేయించాలని సూచించారు.

'కల్యాణలక్ష్మి' మంజూరు

మల్హర్: మండల వ్యాప్తంగా 28మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరైనట్లు తహసీల్దార్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలోనే ప్రత్యేక కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి



కొత్తగూడ: ప్రజా సమస్యలపై క్షేత్ర స్థాయిలో బీజేపీ కార్యకర్తలు ఉద్యమించాలని బీజేపీ రాష్ట్ర రిసెర్చ్ పాలసీ నాయకుడు భుక్యా రాజు సూచించారు. మండలంలోని సాదిరెడ్డిపల్లిలో జరిగిన కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎలా ప్రచారం చేసుకుంటుందో ప్రజలకు వివరించాలన్నారు. గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా కేంద్రం నిధులు విడుదల చేస్తే రాష్ట్రం వాడుకుంటుందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, మండల నాయకులు మునిందర్, భూపతి తిరుపతి, మధు, యాదగిరి మురళి, రవి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై విచారణ

గూడూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ కొమురయ్య, తహసీల్దార్‌పై గత నవంబర్ నెలలో నవతెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బానోతు రామన్ననాయక్ కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై విచారణ చేశారు. రామన్ననాయక్ చేసిన 20 అంశాల్లో ఏ ఒక్కదానికి ఆధారాలు చూపలేదన్నారు.

సమయపాలన పాటించాలి

- స్పెషలాఫీసర్ రవి
- పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


వైద్యాధికారితో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ రవి

మంగపేట: మండలంలోని మంగపేట, చుంచుపల్లి పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల స్పెషలాఫీసర్ తుల రవి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈక్రమంలో ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారి, సిబ్బంది హాజరు, మందుల స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. పీహెచ్‌సీల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని కేవలం డెంగీ నిర్ధారణ పరీక్షల కిట్లు లేవని ఇండెంటు పెట్టి తెప్పిస్తామని వైద్యులు తెలిపారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలటిస్తూ పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించి ప్రభుత్వ వైద్యంపై పూర్తి నమ్మకం కలిగించాలని సూచించారు. అనంతరం చుంచుపల్లిలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఎంతమంది పిల్లలు ఉన్నారు. హాజరైన విద్యార్థుల సంఖ్యను పరిశీలించారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ టీచర్ ప్రభావతికి సూచించారు. అనంతరం పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన హరితహారం మొక్కల పెంపకం నర్సరీని పరిశీలించారు. అనంతరం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో కోతుల బెడద ద్వారా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా రూ.10 లక్షల కలెక్టర్ ఫండ్‌తో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో మండల స్పెషలాఫీసర్ తుల రవి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీలలో పనుల్న వసూలు ఎంతమేరకు జరుగుతొందని, నర్సరీలలో మొక్కల పెంపకం ఎలా ఉందని, మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల వివరాలు, రోజువారీ కూలీల సంఖ్య తదితర అంశాలపై చర్చించారు. గ్రామ పంచాయతీలలో కార్యదర్శులు 100 శాతం ట్యాక్స్ వసూలు చేయాలని సూచించారు. పంచాయతీ వారీగా టార్గెట్ ప్రకారంగా నర్సరీల్లో మొక్కలు పెంచాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో లేబర్ రిపోర్టు పెంచాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీఓ చరణ్‌రాజ్, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

పగిడిద్దరాజు జాతరను విజయవంతం చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పూజారులు

ఎస్ఎస్ తాడ్వాయి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలోని యాపలగడ్డ గ్రామంలో మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న పగిడిద్దరాజు జాతరకు విజయవంతం చేయాలని పగిడిద్దరాజు పూజారి ఆరెం లచ్చుపటేల్ కోరారు. గురువారం మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ సన్నిధిలో లచ్చుపటేల్ అధ్వర్యంలో పగిడిద్ద రాజు జాతర పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఆరెం వంశస్థుల ఆధ్వర్యంలో యాపలగడ్డలో నిర్వహించనున్న పగిడిద్దరాజు జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. మూడు రోజుల పాటు పగిడిద్దరాజు జాతరలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క పూజారి సిద్దబోయిన స్వామి, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పాక సాంబయ్య, తాడ్వాయి సర్పంచ్ ఈర్ప సునిల్, పీఏసీఎస్ డైరెక్టర్ యానాల సిద్దిరెడ్డి, నాయకుడు పాక రాజేందర్, హనుమాండ్ల రాజిరెడ్డి, ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ బాలకృష్ణ పాల్గొన్నారు.

హర్షం

టేకుమట్ల: చిట్యాల మండలంలోని గిద్దెముత్తారం, కాల్వపల్లి గ్రామాలను టేకుమట్ల మండలంలో విలీనం చేస్తానని గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ హామీ ఇవ్వడంతో గిద్దెముత్తారం, కాల్వపల్లి గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గోరికొత్తపల్లికి గెజిట్..

రేగొండ మండలంలోని గోరికొత్తపల్లిని నూతన మండలంగా ప్రకటించారు. కానీ, ఇప్పటి వరకు ఇంకా గెజిట్ విడుదల చేయలేదని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలుపడంతో అభ్యంతరాల స్వీకరణ పూర్తి చేసి వెంటనే మంత్రితో మాట్లాడి త్వరలోనే గోరికొత్తపల్లికి నూతన మండల గెజిట్‌ను విడుదల చేసి, నూతన అధికార కార్యాలయాలను సైతం ప్రారంభిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. దీంతో గోరికొత్తపల్లి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ములుగు రూరల్: గత ఏడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎండీ అమ్జద్‌పాషా కోరారు. ఈ మేరకు గురువారం అటవీశాఖ డివిజనల్ అధికారి జోగేందర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన అటవీ అధికారికి వినతిపత్రం అందించిన సమయంలో ఫిబ్రవరి నెలలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. నిరుపేదలు తునికాకు సేకరణ చేపట్టి బోనస్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎండీ గఫూర్, బోడ రమేస ప్రవీణ్, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

అధిక పన్నులతో వ్యాపారుల బెంబేలు


ఏటూరునాగారం జీపీ కార్యాలయం

ఏటూరునాగారం: ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీలో ఉన్న వ్యాపారుల లైసెన్సులను గ్రామ పంచాయతీ అధికారులు, పాలకులు ఇష్టానుసారంగా రెట్టింపు చేసి వసూలు చేస్తున్నారని వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. ములుగు, నర్సంపేట, పరకాల వంటి పట్టణాల్లో లేని లైసెన్సుల పన్నులు ఏటూరునాగారంలో విధించడంపై గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది తీరును తప్పుబడుతున్నారు. తమ ఓట్లతో గెలిచిన పాలకులకు సైతం ప్రజల నడ్డీ విరిచేందుకు అధికారులకు వత్తాసు పలుకుతూ అధిక వసూళ్లకు మద్దతు తెలపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు లైసెన్సులు పన్నులు, రెన్యూవల్స్ సైతం పండ్ల బండి, పాన్‌షాపులకు సైతం రూ.3వేల వరకు వసూలు చేయడంతో జంకుతున్నారు. రోజుకు వందో రెండు వందలో విక్రయించే షాపులు సైతం వేలాది రూపాయలను చెల్లించాలనడం బలవంత మే అవుతుందని వ్యాపారులు వాపోతున్నారు. దీని పై ఆందోళనలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా వ్యాపారులంతా కలిసి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. అయితే ఇదే విషయంపై పంచాయతీ కార్యదర్శి అశోక్‌ను వివరణ కోరగా.. గ్రీన్‌టాక్స్, ఆన్‌లైన్‌లో ఫిక్స్ అయి ఉందని.. దాని ప్రకారమే వసూలు చేస్తున్నట్లు చెప్పారు. నిబంధనల ప్రకారమే వసూలు చేస్తామన్నారు. గ్రీన్ ట్యాక్స్ ప్రభుత్వ ఖాతాలో జమ అవుతుంది. జీపీ ఖాతాలో కాదని తెలిపారు.

'నల్లెల' మరణం పార్టీకి తీరని లోటు


నివాళులర్పిస్తున్న గండ్ర సత్యనారాయణరావు


పాడె మోస్తున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క


నివాళులర్పిస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ములుగు రూరల్: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లెల్ల కుమారస్వామి మృతి చెందడం పార్టీకి తీరిలోటని టీపీసీసీ సభ్యుడు గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఈ మేరకు గురువారం ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డిలతో కలిసి కుమారస్వామి పార్థివదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ములుగు ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య


రాజేశ్వరి(ఫైల్)

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లి(బి)లో బుధవారం రాత్రి ఓ వృద్ధురాలు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రావుపల్లి(బి) గ్రామానికి చెందిన వీరవేని రాజేశ్వరి(70) వృద్ధాప్యంతో భాదపడుతూ నడవలేని స్థితిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేక జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతురాలు తన కొడుకు, కొడలుకు భారం కాకూడదనే భావనతో ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. గురువారం మృతిరాలి భర్త పోశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై చల్ల రాజు తెలిపారు.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

టేకుమట్ల/రేగొండ: జిల్లా కేంద్రంలో గురువారం కొనసాగిన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో టేకుమట్ల మండలం నుంచి సుమారు 3,000 మంది పార్టీ శ్రేణులు తరలివెళ్లినట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సట్ల రవిగౌడ్, ఆకునూరి తిరుపతి తెలిపారు. దీంతోపాటు రేగొండ మండలం నుంచి జిల్లా కేంద్రానికి సుమారు 9,600 మంది పార్టీ శ్రేణులు తరలినట్లు బీఆర్ఎస్ మండల, టౌన్ అధ్యక్షుడు అంకం రాజేందర్, కొలెపాక భిక్షపతి వెల్లడించారు.

'కేసీఆర్ పాలనకు అంతం పలకాలి'

గూడూరు: సీఎం కేసీఆర్ పాలనకు అంతం పలికినపుడే తెలంగాణ అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. మండలంలోని రాజనపల్లి, గోవిందాపురం, మర్రిమిట్ట గ్రామాలలో గురువారం ప్రజాగోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించని పెట్రోల్ బంక్ సీజ్


బంక్‌ను సీజ్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి వరలక్ష్మి ఫిలింగ్ స్టేషన్ బకాయి పన్నులు రూ.16,400 చెల్లించకపోవడంతో సీజ్ చేసినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి రమాదేవి గురువారం తెలిపారు. పెట్రోల్ బంక్‌లో లక్షలాది రూపాయలు లావాదేవీలు జరుగుతుండడంతో కనీసం గ్రామ పంచాయతీ పన్నులు కూడా కట్టలేకుండా ఎగ్గకొట్టాలని యజమాన్యం మోసం చేసే పనులు చేయడం ఏమిటని ప్రజలు మండిపడుతున్నారు. గ్రామ పంచాయతీ వచ్చే ఆదాయంతో గ్రామాభివృద్ధి జరుగుతుంది. కానీ, వ్యాపారం చేసుకుంటున్న పెట్రోల్ బంక్ యజమాన్యం ఇలా చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు.

పాఠశాల భవనాల్లో నాసిరకం పనులు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలల భవన నిర్మాణాలు నాసిరకంగా చేపడుతున్నారని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు రత్నం ప్రవీణ్, తోకల రవి ఆరోపించారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ వైవీ గణేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల భవనాలు, ప్రహరీ నిర్మాణాలు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న సంబంధిత శాఖ ఏఈ, డీఈలు పట్టించుకోవడం లేదని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో దశల వారీగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జాగటి రవితేజ, బాలేశ్వర్, స్వామి, శివ, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


లబ్ధిదారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

కన్నాయిగూడెం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ జనగం సమ్మక్క, తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీఓ ఫణిచంద్ర తదితరులు పాల్గొని, చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ జనగం సమ్మక్క మాట్లాడారు. పేదింటి పెళ్లికి ప్రభుత్వం అందించే కానుక కల్యాణ లక్ష్మి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ప్రభాకర్, దుర్గం నారాయణ, సీనియర్ అసిస్టెంట్ ధనలక్ష్మీ, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కావిరి చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరివికాసం పథకంలో పురోగతి ఉండాలి

- ఉమ్మడి జిల్లాలోని డీఆర్‌డీఏ ఏపీడీలతో పీఓ జూమ్ సమీక్ష


జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: గిరివికాసం పథకంలో పురోగతి ఉండేలా చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని డీఆర్‌డీఏ అదనపు ప్రాజెక్ట డైరెక్టర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు, డివిజన్ ఇంజనీర్లతో జూమ్ మీటింగ్‌ను నిర్వహించారు. జిల్లాల వారీగా బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు, వచ్చిన దరఖాస్తుల సంఖ్య, భూగర్భ జల శాఖ నుంచి జియాలసిస్ట్ సర్వే చేయబడిందన్నారు. బోర్ వెల్స్, గొట్టపు బావుల కోసం జియాలసిస్ట్ సిఫార్సులు, దరఖాస్తుల అంచనాలు సిద్ధం చేసినట్లు చెప్పారు. బోరుబావుల సంఖ్య, సాగు దిగుబడి, విద్యుత్ సరఫరాలో త్రీఫేజ్ సౌకర్యం ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గిరిజన రైతుల దరఖాస్తులను వారం రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ఎక్కడ ఏ పెండింగ్ ఫైల్ ఉన్న వెంటనే మూ చేయాలన్నారు. ఐటీడీఏలో గిరి వికాసం పథకంపై అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయని, ఇంకా గిరిజన రైతులకు అవకాశం కల్పించాలన్నారు. పూర్తి వివరాలతో కూడిన జాబితాను ఐటీడీఏకు పంపించాలని అధికారులను ఆదేశించారు. సీఎం గిరి వికాసం పథకం తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాత్మక కార్యక్రమ విషయంలో ఎవరు కూడా నిర్లక్ష్యం చేయొద్దన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పంచాయతీరాజ్, భూగర్భ జలాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి, విద్యుత్ శాఖలను సమన్వయం చేసుకొని ముందుకు పోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, పీహెచ్ఓ భారతి, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేష్, ఏపీడీలు వెంకటనారాయణ, సాయిచరణ్, డీఈలు హర్షి, తారా చంద్, భికాపతి పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన జెన్‌కో ఉద్యోగులు


కేటీఆర్‌కు సమస్యలు వివరిస్తున్న ఉద్యోగులు

గణపురం: పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనకు గురువారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిను టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జాన్సన్, జెన్‌కో అధ్యక్షుడు ఎలగంటి రఘోత్తంరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌కు విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్ కార్మికుల పీఆర్‌సీపై వినతి పత్రం అందించారు. స్పందించిన కేటీఆర్ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఐఎన్‌టీయూసీ 1535 నుంచి పలువురు నాయకులు టీఆర్‌వీకేఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పుట్టపాక కిరణ్, రాజేశ్వర్‌రావు, మల్లిక్, మాధవరావు, నాగరాజు, తదితరులు ఉన్నారు.

సమస్యలపై మంత్రికి వినతి

భూపాలపల్లి రూరల్: ఉపాధిహామీ ఉద్యోగుల సమస్యలు పరిస్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ... జిల్లా ఉపాధి హామీ ఉద్యోగుల జాక్ కమిటీ చైర్మెన్ జమీర్‌పాషా ఆధ్వర్యంలో గురువారం మంత్రి కేటీఆర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని త్వరలోనే పరిష్కారమతాయని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు జాక్ నేతలు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉపాధి హామీ అధికారుల సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

కులవివక్ష చూపడం బాధాకరం

బొడ్డు రాజబాబు


మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

కాటారం: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకుండా కుల వివక్ష చూపడం బాధాకరమని బీఎస్పీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రాజ్‌కుమార్ అన్నారు. కాటారం మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు.

బహుజన వర్గాలకు చెందిన ఎమ్మెల్యే అనే ఎలాంటి అధికార లాంఛనాలకు సీఎం కేసీఆర్ ఆదేశాలు ఇవ్వలేదని, దొర అహంకారానికి ఇది నిదర్శనమని ఆరోపించారు. ఉన్నత వర్గాలకు చెందిన సినిమా వాళ్లు, రాజకీయ నాయకులు మృతి చెందినప్పుడు ప్రభుత్వం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి, ఎమ్మెల్యే సాయన్న అంత్యక్రియలను పట్టించుకోకపోవడం బడుగు బలహీన వర్గాలకు అవమానకరమని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మౌలానా తదితరులు పాల్గొన్నారు.

కంటిని కాపాడుకోవాలి


శిబిరాన్ని సందర్శించిన డాక్టర్ సుజాత

ఏటూరునాగారం: కంటికి ఎలాంటి హాని కలగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని రొయ్యూర్ వైద్యాధికారి సుజాత అన్నారు. గురువారం మండలంలోని గోగుపల్లి గ్రామంలో చేపట్టిన కంటి వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించి పలు సూచనలు చేశారు. కంటి పరీక్షలకు అంధత్వ సమస్యలున్న వారు శిబిరానికి రావాలని, ప్రజాప్రతినిధులు ప్రజలను చైతన్య పర్చాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ జయోతి, అప్తాల్మిక్ అసిస్టెంట్ భాగ్య, ఏఎన్ఎంలు ధనలక్ష్మి, జైలుబాబు, పుణ్యవతి, ఆశ కార్యకర్తలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.